క్లుప్తంగా

నేడు పెద్దదోర్నాలలో మంత్రి సురేష్ పర్యటన

పెద్దదోర్నాల: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక కర్నూలు రోడ్డులోని మార్కెట్ యార్డ్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవనాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 3 గంటలకు మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని రమణారెడ్డి కోరారు.

నేటి నుంచి యోగా తరగతులు

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసకుమార్ తెలిపారు. వేసవి సెలవుల దృష్ట్యా మే 1వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు యోగా తరగతులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ప్రతి రోజు నిర్వహిస్తారన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, గుండెజబ్బుల నుంచి రక్షణకు, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు విద్యార్థుల నుంచి పెద్దవారి వరకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బుద్ధయోగ హెల్త్ ఫౌండేషన్, ఆయుష్, రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో యోగా ఇన్‌స్ట్రక్టర్ ఈశ్వర్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌లు ఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

వైన్ షాపులో చోరీ

దొనకొండ: స్థానిక వైన్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.1.90 లక్షలు స్వాహా చేశారు. ఎస్‌ఐ యం.సైదుబాబు తెలిపిన వివరాలు.. వైన్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో తాళాలు పగులగొట్టి రూ.1.90 లక్షలు దొంగలించారు. ఒంగోలు క్లూస్ టీమ్ ఎస్‌ఐ శరత్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది వేలి ముద్రలు సేకరించారు. త్రిపురాంతకం సీఐ పాపారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

బీసీలు రాజ్యాధికారం సాధించాలి

పొదిలి: బీసీలు ఐక్యంగా రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త బోడె రామచంద్ర యాదవ్ చెప్పారు. ఆదివారం రాత్రి స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాలులో మందగిరి వెంకటేష్ అధ్యక్షతన బీసీల సమ్మేళనం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్ర యాదవ్ మాట్లాడారు. ఎంపీపీ ఎం.మురళీకృష్ణ, బీసీ సంఘాల నాయకులు పాశం వెంకటేశ్వర్లు, మిరియం శ్రీనివాసులు, ఎం.బాబూరావు, కనకం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన అజయ్

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంభంపాటి అజయ్‌కి గాయాలయ్యాయి. కాలనీకి చెందిన అజయ్ బుల్లెట్ వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి రోడ్డు మీదకు వస్తున్నాడు. అదే సమయంలో దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో పసుపుగల్లు ఎస్సీ కాలనీ వద్ద కు చేరుకున్న లారీని పక్క నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అజయ్ తలకి గాయాలయ్యాయి. దీంతో ప్రైవేట్ వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వీఆర్‌ఓల సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శిగా కిలారి

పొదిలి: జిల్లా వీఆర్‌ఓల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో పొదిలికి చెందిన కిలారి సుబ్బారావు సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుబ్బారావు మండలంలోని కొండాయపాలెం సచివాలయం వీఆర్‌ఓగా, ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్‌ఓల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా ప్రయత్నం చేస్తామని, పదవి వచ్చేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వీఆర్‌ఓలు, రెవెన్యూ ఉద్యోగులు సుబ్బారావుకు అభినందనలు తెలిపారు.

అటెండర్‌కి ఆర్థిక సాయం

ముండ్లమూరు: మండల విద్యావనరుల కేంద్రంలో అటెండర్‌గా పని చేసిన ముప్పాళ్ల యోగయ్యకు ఉపాధ్యాయులు 43500 రూపాయల నగదును ఆదివారం ఆర్థిక సహాయంగా అందజేశారు. యోగయ్య చాలా కాలం కాంట్రాక్టు పద్ధతిలో ఎంఈఓ కార్యాలయంలో అటెండర్‌గా పని చేశాడు. నిధులు లేక పోవడంతో అతను ఇంటి దగ్గరే ఉంటున్నారు. పదిహేను రోజుల క్రితం ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో సమస్యను గుర్తించి ఏపీటీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో 77 మంది ఉపాధ్యాయులు తమకి తోచిన సహాయాన్ని ప్రకటించడంతో 43500 నగదును యోగయ్యకు అందజేశారు. ఉపాధ్యాయులు వాకా జనార్దన్ రెడ్డి, లేవి ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధన ఉత్సవాలు


దర్శి: గోమాతను పూజిస్తున్న మహిళలు


దొనకొండ: వీరబ్రహ్మేంద్రస్వామి


కొమరోలు : పూజలు అందుకుంటున్నస్వామి


కోటా సత్యమాంబదేవికి పూజలు చేస్తున్న అన్నా క్రిష్ణచైతన్య


మార్కాపురం: ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు


కొనకనమిట్ల: గనివానిపాడులో నైవేద్యాలతో మహిళలు

కొనకనమిట్ల: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గనివానిపాడు, మునగపాడు, కొనకనమిట్ల, చినమనగుండం, పెదారికట్ల గ్రామాల్లోని బ్రహ్మంగారి ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బ్రహ్మంగారి స్వామిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పొదిలి ఆర్టీసీ డిపో నుంచి బ్రహ్మంగారి మఠానికి స్పెషల్ బస్సులు నడిపారు.

ముండ్లమూరు: పెద ఉల్లగల్లు, ముండ్లమూరు, రమణారెడ్డిపాలెం, కమ్మవారిపాలెం, తమ్మలూరు, పులిపాడు, భీమవరం, పోలవరం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం, వడపప్పు, పానకం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చెన్నకేశవస్వామికి నందిసేవ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య మంగళ వాయిద్యాలతో స్వామి వారికి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ ఉభయదాతలుగా దమ్మాలపాటి, బొడ్డపాటి, గోపిశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, సుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం చెన్నకేశవస్వామి రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వాసవి మాత జయంతి

మార్కాపురం: వాసవి మాత జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని కన్యాకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అన్నాభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి లలిత సహస్రనామం అష్టోత్ర పూజలను చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కమిటీ కార్యదర్శి సూరె వెంకటసుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్, మల్లిపెద్ది కేశవ, పాదర్తి గిరి, ఆలంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుమారు 10వేల మందికి అన్నవితరణ చేశారు. గత రెండు రోజుల నుంచి అమ్మవారి ఉత్సవాలు జరిగాయి.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని 9వ వార్డులో ఉన్న శ్రీరమాసహిత సత్యనారాయణస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు జరుగుతున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు బాసాని సుధాకర్‌రావు, పాదర్తి కృష్ణారావు ఆదివారం తెలిపారు. సోమవారం రాత్రి 8.15 నిమిషాలకు సత్యనారాయణ స్వామి కల్యాణం జరుగుతుందని, 2న హనుమంత వాహనం, 3, గరుడ వాహనం, 4న గజవాహనం, 5న స్వామివారి రథోత్సవం అదే రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తునట్లు తెలిపారు.

తాళ్లూరు: మండలంలోని పలు వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయాల్లో ఆదివారం బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విఠలాపురం కాలనీలో ఆరాధనోత్సవాల సందర్భంగా ఆలయంలో స్వామి వారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గంగా భవాని అమ్మవారికి..

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భక్తులకు అన్నదానం

గిద్దలూరు రూరల్: కాలజ్ఞాన రచయిత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాలకు వెళ్లే భక్తులకు స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రంగాచారి ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. తెలంగాణ, కర్నూల్ జిల్లా, విజయవాడ వంటి ఇతర ప్రాంతాల నుంచి కడప జిల్లాలో కొలువుదీరిన స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున బయలు దేరి వచ్చారు. వారి సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ వారు అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తర్లుపాడు: మండల కేంద్రంలో ఆదివారం బ్రహ్మంగారి ఆరాధన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఆలయంలో విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ వి. అంకమ్మ, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డితో పాటు పలువురు నాయకులు పూజలు నిర్వహించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవ రెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల

దర్శి టౌన్: బొట్లపాలెంలో వేచి ఉన్న విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఐదు ప్రభలను ఏర్పాటు చేశారు. అందులో వైఎస్సార్ సీపీ అభిమానులు మూడు ప్రభలను, టీడీపీ రెండు ప్రభలను ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ప్రభల ఏర్పాటు ఏర్పాటుకు భక్తులు ఏర్పాటు చేశారు. అయితే ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పెద్ద వర్షం రావటంతో భక్తులు ఆందోళ చెందారు. దర్శి డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి ఆధ్వర్యంలో దర్శి సీఐ రామకోటయ్య పర్యవేక్షణలో దర్శి ఎస్ఐ రామక్రిష్ణతో పాటు మరో ఐదుగురు ఎస్ఐలు , 50 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు కుమారుడు అన్నా క్రిష్ణచైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని మఠం వీధిలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారిని ఊరేగించారు. రాత్రి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం ప్రదర్శించారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారిశాలలో భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. 102 మంది మహిళలు గంగా జలాలను కలశాల ద్వారా తీసుకొచ్చిన నీటితో అభిషేకాలు చేశారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టి.సత్యనారాయణ, హనుమంతరావు, దేవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో వెలసిన బ్రహ్మంగారి ఆరాధన ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆరవల్లిపాడు శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన సందర్భంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు గ్రామస్తులు నిర్వహించారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో, ఇండ్లచెరువులో తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇండ్లచెరువు గ్రామంలో అన్నదానం చేశారు.

శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు

దర్శి టౌన్: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు నియోజక వర్గంలో ఘనంగా నిర్వహించారు. దర్శి పట్టణంలో, తాళ్లూరు మండలంలో తూర్పుగంగవరం, తాళ్లూరు గ్రామాలలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

గడప గడపలో ఎమ్మెల్యే కేపీకి ఘన స్వాగతం

మార్కాపురం: నవరత్నాల్లోని పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ పాల్గొని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ నవరత్నాల్లాంటి పథకాలు అమలు చేసి పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హులైన వారు ఉంటే ఎవరి ఒత్తిడీ లేకుండా నేరుగా పథకంతో లబ్ధిపొందవచ్చని ఎమ్మెల్యే కేపీ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో లబ్ధిదారుని అకౌంట్‌లో నేరుగా నగదు జమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాల అమలు వల్ల ప్రజల కష్టాలు తీరుతున్నాయని, ఆర్థికంగా కష్టాల నుంచి గట్టెక్కుతున్నారని చెప్పారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్ఆర్ పింఛన్, జగనన్న విద్యదీవెన, ఆసరా వంటి పథకాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. గ్రామస్తులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే కేపీపై పూలుచల్లి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ చెంచిరెడ్డి, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఎంపీడీవో నరసింహులు, ఎంపీటీసీలు వేమారెడ్డి, కందుల మల్లారెడ్డి, పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, కోలగట్ల శివారెడ్డి, మూల ఎల్లారెడ్డి, గ్రామస్తులు, పార్టీ నాయకులు, రూరల్ ఎస్ఐ సుమన్, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

ఎడ్ల బండ లాగుడు పోటీలు

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సందర్భంగా గ్రామస్తులు ఎడ్ల బండ లాగుడు పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆరు పళ్ళ ఎడ్ల విభాగంలో నంద్యాల జిల్లా ఎస్.కొత్తూరుకు చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డి ఎడ్లు ప్రథమ, ప్రకాశం జిల్లా యర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హెమలతానాయుడు ఎడ్లు ద్వితీయ, గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన చిన్నబ్బాయి యాదవ్ ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి. వరుస బహుమతులుగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలతో పాటు అనంతర స్థానాల్లో నిలిచిన ఎడ్లకు రూ.20 వేలు, రూ,15 వేలు, రూ.10 వేల వంతున యజమానులకు అందజేశారు.

గీతాంజలిలో గ్రాడ్యుయేషన్ డే

పొదిలి: స్థానిక గీతాంజలి ఇంగ్లిషు మీడియం హైస్కూలులో యూకేజీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకునే క్రమంలో ఒకటో తరగతిలోకి ప్రవేశానికి సిద్ధం అవుతున్న వేళ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తే ప్రోత్సాహంగా ఉంటుందని ప్రభుత్వ వైద్యశాల సివిల్ సర్జన్ డాక్టర్ సంగీత అన్నారు. అతిథులుగా ఎం.విజయకుమార్‌రెడ్డి, కేసీహెచ్ పద్మజ ప్రసంగించారు. పాఠశాల చైర్‌పర్సన్ కె.భాగ్యలక్ష్మి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.అలేఖ్య, డైరెక్టర్ కె.ప్రజ్వల, ప్రిన్సిపల్ ఎం.ప్రశాంతి పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు సహకారం అందిస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

మార్కాపురం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాకు తన వంతు సహకారం, చేయూత అందిస్తానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత వరకు తాను ఎలాంటి తప్పు చేయాలేదని, భవిష్యత్తులో కూడా ఎలాంటి తప్పులు, పొరపాట్లు ఉండవన్నారు. సోషల్ మీడియా ప్రతినిధులు పార్టీ అభివృద్ధి కోసం మరోసారి జగనన్నను సీఎం చేసేందుకు కృషి చేయాలని, అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారన్నారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రాజీరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ వాసుదేవరెడ్డి, వివిధ మండలాల కన్వీనర్‌లైన శేఖర్, ఇంద్రసేనరెడ్డి, కోలగట్ల శివారెడ్డి, తారకసాయి, రంగయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

కొనకనమిట్ల: మండలంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని మండల వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం కమిటీ అధ్యక్షుడు నుసుం బాలచంద్రుడు రాష్ట్ర అధ్యక్షులు ఇందిరా కిరణ్‌రాజును కలిసి విన్నవించారు. విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులను కలిసిన బాలచంద్రుడు ప్రభుత్వం తరపున వచ్చే రాయితీలను దివ్యాంగులకు సక్రమంగా అందేలా కృషి చేయాలన్నారు. అందుకు మండలంలో తమవంతు కృషి చేస్తామన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో ఇటీవల జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల కమిటీ అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాలరెడ్డి ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిళ్లు, వీల్‌చైర్లు పంపిణీ చేశామని తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తెస్తే అధికారులతో, ప్రజా ప్రతిధులతో మాట్లాడి వారికి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు హామీ ఇచ్చినట్లు బాలచంద్రుడు తెలిపారు.

ఉన్నత పాఠశాలకు రూ.10 లక్షల విరాళం


హెచ్‌ఎంకు విరాళం అంగీకార పత్రం అందిస్తున్న మురళీకృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి 10 లక్షల రూపాయల విరాళం ప్రకటించడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం యం. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నేటి విద్యార్థులే రేపటి భారతీయ విలువల నిర్మాతలు అటువంటి వారి పట్ల ఉపాధ్యాయులుగా తమ కృషితో పాటు తల్లిదండ్రులుగా తమ పిల్లల పట్ల జాగ్రత్త వహిస్తూ ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు పుస్తకాల పట్ల ఆసక్తిని పెంచి సృజనాత్మక పెంచవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేయుచున్న మురళీకృష్ణ 10 లక్షల రూపాయల విరాళం అందజేయడం ద్వారా పాఠశాల లైబ్రరీ పాఠశాల అభివృద్ధి పరుస్తామన్నారు. మార్కాపురం కెనరా బ్యాంక్ స్టాఫ్ ప్రతినిధులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జి.ఎల్ రమేష్‌బాబు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి 'స్పందన'

కొనకనమిట్ల: మార్కాపురం సౌజన్య ఫంక్షన్ హాలులో కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రత్యేక ×స్పందన₹ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కేతబోయిన ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. కావున మండల ప్రజలు ఏవైనా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించాలన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

త్రిపురాంతకం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన వారంతా వారి కుటుంబ సభ్యులను మిగిలిన మిత్రులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం టి.రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించగా, ఆనాటి గురువులు జీవీ నారాయణరావు, టి.మల్లారెడ్డి, సుబ్బమ్మ, ఎం.భాస్కరరెడ్డి, సుబ్బారావు, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌లను ఘనంగా సన్మానించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయం సెంటర్ నుంచి హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


పోలేరమ్మ గుడిలో పూజలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

● పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: మండలంలోని పందివానిపల్లె గ్రామంలో పట్టాభి సీతారామచంద్రుడు, పోలేరమ్మ దేవాలయాలను ఆదివారం ప్రారంభించుకున్నారు. సీతారాముల విగ్రహాలు, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆయా దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, పెద్దకాపు జి.వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ వెంకటరెడ్డి, సర్పంచ్‌లు అరుణాబాయి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షునిగా వెన్నా


కాశిరెడ్డిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: మండల వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షునిగా వెన్నా కాశిరెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఇద్దరు సభ్యులతో సీఈవో గురవారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, దూదేకుల కార్పొరేషన్ సభ్యుడు దూదేకుల కాశింపీరా, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, అమిరెడ్డి లక్ష్మీరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల నాయకులు లతా చంద్రకాంత్‌నాయక్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, జంకె సుబ్బారెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, బట్టు సుధాకరరెడ్డి, మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌కు వెన్నా కాశిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.